సిబ్బంది లేక ఇబ్బంది..

విద్యుత్‌శాఖలో వేధిస్తున్న సిబ్బంది కొరత

- ఆర్టిజన్లు లేక ఫీల్డ్ సిబ్బంది విధులు
- నాణ్యమైన విద్యుత్ సరఫరాలో ఇబ్బంది
- పట్టించుకోని శాఖ ఉన్నతాధికారులు

దుమ్ముగూడెం: భద్రాచలం డివిజన్‌లోనే పెద్దదైన దుమ్ముగూడెం మండలంలో విద్యుత్ శాఖలో తగిన సిబ్బంది లేకపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం వస్తుండటంతో సిబ్బంది కొరత వలన సమస్యను పరిష్కరించడానికి ఎక్కువ సమయం పడుతుండటంతో వేసవిలో ప్రజలు అల్లాడుతున్నారు. మండలంలో సుమారు వందకు పైగా గ్రామాలుండగా సుమారు గృహ అవసరాల నిమిత్తం 12,500 కనెక్షన్లు, వ్యవసాయ ఆధారిత కనెక్షన్లు సుమారు 2వేల వరకు ఉన్నాయి. వీటికి విద్యుత్ సరఫరాను అందించేందుకు మూడు సబ్ స్టేషన్లు ఉండగా ఈ మూడు సబ్‌స్టేషన్ల పరిధిలో 11 ఫీడర్లున్నాయి. సబ్‌స్టేషన్లలో సరిపడా ఆర్టిజన్లు లేక ఫీల్డ్ సిబ్బంది ఆ విధులను సైతం నిర్వహించాల్సి రావడం వారికి అదనపు భారంగా మారుతుంది. వేసవిలో తరచూ వచ్చే గాలి దుమారాలకు విద్యుత్ స్తంభాలపై, తీగలపై చెట్లు పడటంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. ఆ సమస్యను పరిష్కరించడానికి తగిన సిబ్బంది లేక వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందడం లేదనే విమర్శలు ప్రజల నుండి వస్తున్నాయి.

ఉన్నవారిపై అదనపు భారం..

దుమ్ముగూడెం సబ్‌స్టేషన్‌లో ఆర్టిజన్లు నలుగురు ఉండాల్సి ఉండగా కేవలం ఒక్కరే ఉండటంతో ఫీల్డ్ సిబ్బంది ఆ విధులు నిర్వహిస్తున్నారు. దీంతో సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా ఆగిన సమయంలో మళ్లీ రిస్టోర్ అవ్వడానికి సమయం పడుతుండటంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే పర్ణశాల సబ్‌స్టేషన్‌లో నలుగురికి గాను ముగ్గురు, లచ్చిగూడెంలో నలుగురికి గాను ఇద్దరు ఆర్టిజన్లు విధులు నిర్వహిస్తుండటంతో ఫీల్డ్ సిబ్బందిపై అదనపు భారం పడుతుంది. అలాగే మూడు సబ్‌స్టేషన్‌లలో గాను కేవలం ఒక్క సబ్‌స్టేషన్‌కు మాత్రమే వాచ్‌మెన్ ఉండటం మిగతా రెండు సబ్‌స్టేషన్‌లకు లేకపోవడం విశేషం. మూడు సబ్‌స్టేషన్ల పరిధిలో ఫీల్డ్ సిబ్బంది కొరత కూడా స్పష్టంగా కనిపిస్తుంది.



దుమ్ముగూడెం సబ్‌స్టేషన్

దుమ్ముగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో 8 మంది సిబ్బంది ఉండాల్సింది ఆరుగురు, పర్ణశాలలో ముగ్గురు ఉండాల్సింది ఒక్కరు మాత్రమే ఉన్నారు. లచ్చిగూడెం పరిధిలో నలుగురు ఉండాల్సింది ఇద్దరు మాత్రమే విధులు నిర్వహిస్తూ అదనంగా ఆర్టిజన్ బాధ్యతలు కూడా నిర్వహించడం ఉన్న సిబ్బందికి అదనపు భారంగా మారుతుంది. అలాగే నర్సాపురం ఫీడర్ మండలంలోనే అతిపెద్ద లెంతి ఫీడర్ ఈ ఫీడర్‌లో నలుగురు సిబ్బంది ఉండాల్సింది ఇద్దరు మాత్రమే ఉన్నారు.

లో ఓల్టేజి సమస్య కూడా..

మండలంలో ఓల్టేజి సమస్య తీవ్రంగా వేధిస్తోందని ప్రస్తుతం రాత్రి సమయాల్లో ఏసీలు అందరూ ఆన్ చేస్తుండటంతో ఇంట్లో కనీసం ఫ్యాన్ కూడా తిరగడం లేదని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నర్సాపురం లెంతి ఫీడర్‌ను తగ్గించేందుకు సీతారాంపురంలో మరో సబ్‌స్టేషన్‌ను నిర్మిస్తే వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సిబ్బందిని ఉన్నతాధికారులు నియమించి నాణ్యమైన విద్యుత్‌ను అందించడంతో పాటు ఉన్న సిబ్బందికి అదనపు భారం తగ్గించాలని కోరుతున్నారు. అలాగే లోఓల్టేజి సమస్య వినియోగదారులను ఇబ్బందికి గురి చేస్తోందని సమస్యను అధికారులు వెంటనే పరిష్కరించాలని కోరుతున్నారు.

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం

- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

కరకగూడెం: కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు న్యాయం చేస్తూ రాష్ట్రంలో పారదర్శకంగా పాలన సాగిస్తున్నట్టు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం మండల పరిధిలోని రఘునాథపాలెం, తాటిగూడెం, వెంకటాపురం, వట్టంవారి గుంపు, చిరుమల్ల గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. రఘునాథపాలెం గ్రామంలో సుమారుగా రూ.20 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ భవన నిర్మాణానికి స్థలం ఇచ్చిన దాతలు పోలెబోయిన కుంటుంబంకు చెందిన ప్రభాకర్ రావు, నరసింహారావు, కృష్ణమూర్తి, ముత్తయ్యలను శాలువాతో సన్మానించారు. అలాగే అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వం ప్రారంభించిన గ్యారెంటీ పథకాలు ప్రజలకు చేరుతున్నాయా లేదా ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు. అనంతరం లబ్దిదారులకు సుమారుగా కల్యాణ లక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. కాంగ్రెస్ పేదల ప్రభుత్వమని, సంక్షేమ పథకాలు పేదలకు అందించడంలో ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగప్రసాద్, ఎంపీడీఓ కుమార్, ఎంఈఓ మంజుల, అధికారులు, మాజీ సర్పంచులు పోలెబోయిన శ్రీవాణి, తిరుపతయ్య, పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, నాయకులు సురేష్, జలగం కృష్ణ, గొగ్గల రవి పాల్గొన్నారు.



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం

ఐఎన్‌టీయూసీ జెండా ఆవిష్కరణ



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం డివిజన్ ఆఫీస్ ఎదుట ఐఎన్‌టీయూసీ 327 యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కొత్త జెండా పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా స్టేట్ సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ మాట్లాడుతూ... విద్యుత్ సంస్థలో కార్మికుల పక్షాన సంజీవరెడ్డి నాయకత్వంలో యూనియన్ ఎన్నో పోరాటాలు చేసిందని భవిష్యత్‌లో కూడా చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రామకృష్ణ, రాజేష్, భద్రాచలం డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు సర్వేశ్వరరావు, ఆదినారాయణ, డివిజనల్ ట్రెజరర్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ త్రినాథ్ రెడ్డి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తాగునీటి సమస్య పరిష్కరించాలి



రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

ములకలపల్లి: గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని మండలంలోని మొండిఒర్రె గ్రామస్తులు ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ నిమ్మల మధు వారికి మద్దతు తెలిపి మాట్లాడుతూ.. చాటిగూడెం జీపీలోని మొండిఒర్రెలో పదిరోజులుగా నీటి సరఫరా నిలిచిపోయిందని, మండు వేసవిలో దాహార్తితో ప్రజలు అల్లాడుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారన్నారు. దీనిపై జీపీ కార్యదర్శి మురళి మాట్లాడుతూ... మోటారు మరమ్మతులకు గురికావడంతో నీటి సరఫరాలో ఇబ్బంది ఏర్పడిందని, సాయంత్రంలోగా మోటారు ఏర్పాటు చేసి, తాగునీటి సరఫరా పునరుద్ధరించినట్లు స్పష్టం చేశారు.

యువత క్రీడల్లో రాణించాలి



క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న రేసులక్ష్మి

దుమ్ముగూడెం: యువత క్రీడా పోటీలలో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మాజీ ఎంపీపీ రేసులక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని పాతజిన్నెలగూడెం గ్రామంలో పంచాయతీ పరిధిలో గల గ్రామాల క్రీడాకారులతో మినీ ఐపీఎల్ క్రికెట్ పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తునికి కామేశ్వరావు, మిడియం కొండబాబు, సోయం కృష్ణబాబు, పాపరావు, సొందే గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్సీలో ఇంకుడుగుంత

ములకలపల్లి: మండలకేంద్రంలోని ఎమ్మార్సీ (మండల విద్యావనరుల కేంద్రం)లో ఇంకుడుగుంత పనులను సోమవారం ఎంపీడీఓ గద్దె రేవతి ప్రారంభించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో విధిగా ఇంకుడుగుంత ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశాల మేరకు వీటిని నిర్మిస్తున్నట్లు ఎంఈఓ సత్యనారాయణ తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం

మణుగూరు టౌన్: మున్సిపాలిటీలోని విఠల్‌రావు నగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో సింగరేణి ఆధ్వర్యంలో వైద్యశిబిరం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు శేషగిరిరావు గ్రామస్తులు 145 మందికి పరీక్షలు నిర్వహించి వివిధ రోగాలకు మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

'రాజీవ్ యువ వికాసం' దరఖాస్తుల పరిశీలన

అశ్వాపురం: మండలంలో 24 పంచాయతీల్లో రాజీవ్ యువవికాసం దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. ఈ మేరకు పంచాయతీల వారిగా దరఖాస్తులను పంచాయతీ కార్యదర్శులకు అందజేయగా దరఖాస్తుల పరిశీలన చేపడుతున్నారు. ఎంపీడీఓ వరప్రసాద్, యూడీసీ పద్మావతి దరఖాస్తుల పరిశీలన కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు.

జడ్జి ప్రియదర్శిని మృతి తీరనిలోటు



మణుగూరు రూరల్: నివాళులర్పిస్తున్న న్యాయవాదులు



దమ్మపేట కోర్టులో..

మణుగూరు రూరల్ : హైకోర్ట్ జడ్జి గిరిజా ప్రియదర్శిని మృతిచెందడం బాధాకరమని, ఆమె మరణం న్యాయవ్యవస్థకు తీరనిలోటని మణుగూరు ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ కోర్ట్ మెజిస్ట్రేట్ కంబపు సూరిరెడ్డి అన్నారు. సోమవారం కోర్ట్ ఆవరణలో ప్రియదర్శిని మృతికి సంతాపం వ్యక్తం చేసి నివాళులర్పించారు. న్యాయవాదులు కందిమళ్ల నర్సింహారావు, దాసరి కవిత, చిర్రా రవికుమార్, పోశం భాస్కర్, సర్వేశ్వరరావు, జాడి చొక్కారావు, మేదరమెట్ల శ్రీనివాస్, పానుగోటి కిషన్, అశోక్, రమేష్, సాంబ, వాసవి, సంధ్య, సావిత్రి, పద్మావతి తదితరులు సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

దమ్మపేట: హైకోర్టు జడ్జి ప్రియదర్శిని ఆకస్మిక మృతిపై దమ్మపేట కోర్టులో జూనియర్ సివిల్ జడ్జి భవానితో పాటుగా బార్ అసోసియేషన్ సభ్యులు నివాళులర్పించి, మౌనం వహించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు మారం సతీష్‌కుమార్, గొంది మురళీ మోహన్, ముప్పిడి శ్యాంసుధాకర్, లక్కినేని నరేంద్ర బాబు, బాలరాజు, నల్లపు ఉదయ్, సంధ్యారాణి, సంజయ్, నరేంద్ర, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ఉద్యమ మార్గదర్శి మార్క్స్



మణుగూరు రూరల్: నివాళులర్పిస్తున్న అయోధ్య, తదితరులు



చంద్రుగొండలో..

మణుగూరు రూరల్: ప్రపంచ ఉద్యమ మార్గదర్శి కారల్‌మార్క్స్ అని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.అయోధ్య అన్నారు. సోమవారం పార్టీ ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో మార్క్స్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కార్ల్ మార్క్స్ చూపిన బాటలోనే ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ పినపాక నియోజకవర్గ కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి, పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, ఏఐటీయూసీ మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఆదర్ల రాములు, సంపత్, లక్ష్మణరావు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రుగొండ : మండలకేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో కారల్‌మార్క్స్ చిత్రపటానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పెద్దిని వేణు, మాజీ సర్పంచ్ కాక సీత, ఆర్ వెంకటాచారి, రాయి రాజా, మిరియాల మోహన్‌రావు, దాసరి సీతారాములు, పోట్రు భద్రం పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

బూర్గంపాడు: విద్యాశాఖ నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ యదుసింహరాజు అన్నారు. ఈ మేరకు సారపాకలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని వృథా చేసుకోకుండా ఆటపాటలు, యోగా, కరాటే, వ్యక్తిత్వ వికాసం, చిత్రలేఖనం, నృత్యం తదితర అంశాలలో నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. హెచ్‌ఎం దూదా, ఉపాధ్యాయులు సత్యనారాయణ, లక్ష్మణ్,హేమ, యోజన పాల్గొన్నారు.

మణుగూరు రూరల్: మండలంలోని పీవీకాలనీ ఇల్లెందు క్లబ్‌లో ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉత్కర్ష, మేధా యోగా వంటి శిక్షణ కార్యక్రమాలను సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా జీఎం దుర్గం రామచందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..శిక్షణా కార్యక్రమాలతో పిల్లల్లో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతుందన్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ సీనియర్ టీచర్ దండు దుర్గ, మణుగూరు ఓసీ పీఓ శ్రీనివాసచారి, సర్వే ఆఫీసర్ సర్వర్ నబి పాల్గొన్నారు.

చంద్రుగొండ : మండలకేంద్రం చంద్రుగొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ తరగతులను ఎంపీడీఓ బయ్యారపు అశోక్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సత్యనారాయణ, పాఠశాల హెచ్‌ఎం ఎంఏ వాజీద్, ఉపాధ్యాయులు మధుసుదన్‌రావు, లక్ష్మణ్, సీఆర్‌పీ సేవ్యా, శిక్షణ వాలంటీర్లు ఆఫ్రీద్, మునిరా, లక్ష్మి పాల్గొన్నారు.

దమ్మపేట: ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించనున్న వేసవి శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి కీసర లక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని దమ్మపేట, పట్వారిగూడెం, మల్కారం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఆరు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు వేసవి శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, పెద్దలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



బూర్గంపాడు: క్యాంపును ప్రారంభించి మాట్లాడుతున్న ఎంఈఓ యదుసింహరాజు



మణుగూరు రూరల్: మాట్లాడుతున్న ఏరియా జీఎం రామచందర్



చంద్రుగొండలో..



దమ్మపేటలో..

తుపాకి రాముడి సందడి



అశ్వాపురం: ఒకప్పుడు గ్రామాల్లో వచ్చే వచ్చే.. తుపాకీ రాముడు వచ్చే అంటూ వేషంతో గ్రామాల్లో తిరిగేవారు. ప్రస్తుతం గ్రామాల్లో ఆ కళలు అంతరించి పోతున్నాయి. ఈ మేరకు మండల కేంద్రంలో సోమవారం తుపాకి రాముడు వేషంతో ఓ వ్యక్తి సందడి చేశాడు. స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

నిబంధనలు పాటించాలి

భద్రాచలంటౌన్: మారుతున్న టెక్నాలజీతోపాటు పెరిగిన ధరలను దృష్టిలో ఉంచుకుని ప్రతీ ఒక్కరూ యూనియన్ నిబంధనలు పాటించాలని భద్రాద్రి ఫ్లెక్స్ ప్రింటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని భూపతిరావు కాలనీలో అసోసియేషన్ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు ఫ్లెక్స్ మెటీరియల్‌పై జీఎస్టీ తగ్గించి దీనిపై జీవనోపాధి పొందుతున్న వారిని ఆదుకోవాలని కోరారు. కొలిపాక నరసింహాస్వామి, బూరి రాధాకృష్ణ, పూదోట విజయ్, దూది సతీష్, నజీర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య

మణుగూరు రూరల్: నాణ్యమైన విద్యకు చిరునామాగా ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లోనే చేరాలని మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ దొడ్డి భద్రయ్య సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ మేరకు కళాశాలలో చేరదలచిన విద్యార్థులు కుల, ఆదాయ, పది, ఇంటర్ మెమోలు, టీసీ, స్టడీ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్‌కార్డ్ నంబర్‌తో లింకైన నెంబర్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో దోస్త్ ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. దోస్త్ మొదటి దఫా ప్రవేశాలకు ఈ నెల 21 వరకు అవకాశం ఉందని తెలిపారు. నమోదు చేసుకుని తర్వాత కళాశాలలో సంప్రదించాలని కోరారు.

అందాల పోటీలను రద్దు చేయాలి

భద్రాచలం అర్బన్: మహిళల ఆత్మ గౌరవాన్ని కించపరిచే హైదరాబాదులో జరిగే మిస్‌వరల్డ్ అందాల పోటీలను రద్దు చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు డి.సీతాలక్ష్మి డిమాండ్ చేశారు. ఐద్వా భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో అందాల పోటీలకు వ్యతిరేకంగా సోమవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలపై రోజురోజుకు అత్యాచారాలు, హత్యలు నియంత్రించే దానిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకునే పరిస్థితి లేదని, అందాల పోటీల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం రూ.255 కోట్లు ఖర్చు పెడుతున్నారని ఆ ఖర్చుతో చదువుకునే అమ్మాయిలకు, ఉపాధి కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా ఉపాధ్యక్షురాలు నాదెళ్ల లీలావతి, ఐద్వా పట్టణ కమిటీ సభ్యులు జి.రాధా, జి నాగలక్ష్మి, కనకశ్రీ, రమణ, సిహెచ్.హైమావతి, లక్ష్మి, గంగ, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఐద్వా నాయకులు

సమస్యలపై ధర్నా..



ధర్నా చేస్తున్న నాయకులు

భద్రాచలం అర్బన్: భద్రాచలం పంచాయతీ పరిధిలోని స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం భద్రాచలం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం పంచాయతీ ఈవోకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి మాట్లాడుతూ.. కరకట్టపై చెత్తను పూసి తగలపెట్టడంతో వస్తున్న పొగ దుర్వాసన కారణంగా రామాలయంకు వస్తున్న భక్తులతో పాటు పరిసర ప్రాంతాల్లోని ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని తక్షణమే కరకట్టపై పోస్తున్న డంపింగ్ యార్డ్‌ను పట్టణ శివారు ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్‌బాబు, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు డి.సీతాలక్ష్మి, పార్టీ పట్టణ కమిటీ సభ్యులు నాదెళ్ల లీలావతి, చుక్కా మాధవరావు, ఏ.రత్నం, శ్రీనివాస్, సంద్ర భూపేంద్ర, రాఘవయ్య, దేవగుప్త కనక, రామకష్ణ, కాకా రమణ, నాగలక్ష్మి, రాధా పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

బూర్గంపాడు: నాగినేనిప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1999–2000 బ్యాచ్ పూర్వ విద్యార్థులు సోమవారం రజతోత్సవ ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకుని ఆనందంగా గడిపారు.

హోటల్ తిండా.. తస్మాత్ జాగ్రత్త..

- కాలం చెల్లిన కూరగాయలు.. నాసిరకం సరుకులతో తయారీ
- అనారోగ్యం పాలవుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



కర్రీ పాయింట్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న కూరలు

మణుగూరు రూరల్: కాలం చెల్లిన కూరగాయలు.. నాసిరకం నూనెలు, సరుకులు వస్తువులు.. శుభ్రత శూన్యం.. వాటితోనే రకరకాల వంటకాలు.. తీనేందుకు ఎగబడుతున్న జనం.. హోటల్ వ్యాపారులకు డబ్బులు, ఆహార ప్రియులకు జబ్బులు.. మణుగూరులోని పలు హోటళ్లలో, కర్రీపాయింట్లలో పరిస్థితి ఇలానే ఉందనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. పెరుగుతున్న జనాభా, మారుతున్న అలవాట్లు, ఉద్యోగ నిర్వహణలతో హోటళ్లు, కర్రీపాయింట్లు ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోతున్నాయి. కానీ వాటికి తగ్గట్టుగానే నాణ్యతాప్రమాణాలు ఉంటున్నాయి. కుళ్లిపోయిన కూరగాయలను తక్కువ ధరలకు తెచ్చి తాలింపులు గుప్పించి ప్రజలకు అంటగడుతూ డబ్బులు దండుకుంటున్నారు. కర్రీపాయింట్లలో, పలు హోటళ్లలో వంటగదులు అపరిశుభ్రంగానే దర్శనమిస్తున్నాయి. ఇక మాంసాహారం విషయానికి వస్తే ఫ్రిజ్‌లలో నిల్వచేసిన మటన్, చికెన్‌ను అతి తక్కువ ధరలకు తెచ్చి మసాలాలతో వంటకాలను సిద్ధం చేసి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కానీ ఇలాంటి ఆహార పదార్థాలను తినడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఆహార పదార్థాలను వండేటప్పుడు కనీస నాణ్యత ప్రమాణాలు పాటించాల్సి ఉండగా ఆయా కర్రీపాయింట్ల, హోటల్ యజమానులను అవేమి పట్టించుకోట్లేదు. వంటల్లో పురుగులు, బల్లులు వంటివి పడగా వినియోగదారులు గొడవలు పడిన సందర్భాలున్నాయి.

కనపడని తనిఖీలు..

ఆహార పదార్థాల తయారీలో నాణ్యత పాటించకపోయినా, నిర్లక్ష్యం వహించినా తనిఖీలు చేపట్టాల్సిన అధికారులు కనీసం కన్నెత్తైనా చూడకంపోవడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. కర్రీపాయింట్లు, హోటళ్లలో నాసిరకం వంటకాలు చేస్తున్నా ఆహార నాణ్యత అధికారులు అడ్రస్ లేరనే విమర్శలు సైతం వినిపిస్తున్నాయి. ఆహార నాణ్యత ప్రమాణాల అధికారుల తనిఖీలు లేకపోవడంతో ఆయా కర్రీపాయింట్ల, హోటళ్ల నిర్వాహకులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. తప్పు జరిగిన సందర్భాల్లో సైతం వినియోగదారులపై దురుసుగా మాట్లాడడం, వాగ్వాదానికి దిగడం వంటివి జరుగుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మణుగూరులో కొన్నేళ్లుగా ఆహార తనిఖీ అధికారులు తనిఖీలు నిర్వహించి కేసులు రాసిన సందర్భాలే లేవని పలువురు వ్యాఖ్యానిస్తుండడం గమనార్హం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తనిఖీలు చేపట్టి ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించి అనారోగ్యాలకు గురి చేసే పదార్థాలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.